


పురుషులే.. అధికం



ఉమ్మడి జిల్లాలో శిశువుల మరణాలు, జననాల వివరాలు		
జిల్లా	జననాలు	మరణాలు
మహబూబ్‌నగర్	13442	1364
నాగర్‌కర్నూల్	7112	2737
గద్వాల	12643	4459
నారాయణపేట	13121	4666
వనపర్తి	10801	3604
మొత్తం	57199	16830

జిల్లాల వారీగా ప్రసవ సమయంలో శిశువుల మరణాల వివరాలు	
మహబూబ్‌నగర్	80
నాగర్‌కర్నూల్	00
గద్వాల	300
నారాయణపేట	233
వనపర్తి	09
మొత్తం	622

జిల్లాల వారీగా శిశువుల మరణాలు	
మహబూబ్‌నగర్	57
నాగర్‌కర్నూల్	13
గద్వాల	106
నారాయణపేట	94
వనపర్తి	73
మొత్తం	343

- ఉమ్మడి జిల్లాలో ఆడ శిశువుల కంటే.. 1,463 మంది మగ శిశువులు అధికంగా జననం
- మరణాల్లోనూ పురుషుల శాతమే ఎక్కువ.. మహిళల కంటే 2,270 అధికం
- కలవరపెడుతున్న శిశు మరణాలు.. అందులో ప్రసవ సమయంలోనివే ఎక్కువ
- మృతులు మహబూబ్‌నగర్‌లో అత్యల్పం.. నారాయణపేట జిల్లాలో అధికం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో జననాల సంఖ్య ఉమ్మడి జిల్లాలోనే అత్యంత తక్కువ..
- శిశు మరణాల్లో గద్వాల ప్రథమం.. తర్వాతి స్థానంలో నారాయణపేట
- 2021 సంవత్సరానికి సంబంధించి సీఆర్‌ఎస్ నివేదిక విడుదల

మహబూబ్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పుట్టుక, మరణం అనేవి మనిషి జీవితంలో సాధారణమైన విషయాలు. వైద్య సేవలు మెరుగుపడుతున్న కొద్దీ మరణాల శాతం తగ్గి, జననాల శాతం కూడా ఎక్కువవుతోంది. మనిషి ఆయుష్షు కూడా పెరుగుతోంది. అయినప్పటికీ ఇంకా వైద్య సేవలు సరిగా అందని ప్రాంతాల్లో జననాల రేటు తక్కువగా ఉంటుండగా, మరణాలు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ వ్యత్యాసానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల గణంకాలు అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు ఆడపిల్లలను ముందుగానే గర్భంలో గుర్తించి తొలగించుకుని, మగ సంతానం కోసం తల్లిదండ్రులు ఎక్కువగా ఆరాటపడేవారు. కాలక్రమంలో అందులో కొంత మార్పు వచ్చినప్పటికీ.. ఇంకా ఆడ, మగ నిష్పత్తిలో తేడాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఆడ శిశువుల కంటే మగ శిశువులు అధికంగానే పుడుతుండటమే అందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. 2021 సంవత్సరానికి సంబంధించి కేంద్ర హోంశాఖ పరిధిలోని సివిల్ రిజిస్ట్రేషన్ విభాగం



ఇటీవల నివేదికను విడుదల చేసింది. అందులో కూడా స్త్రీ, పురుష నిష్పత్తిలో భారీ తేడాలే కనిపిస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 2021 సంవత్సరం లెక్కల ప్రకారం 29,291 మంది మగ శిశువులు పుట్టగా.. 27,828 మంది ఆడ శిశువులు పుట్టారు. ఆడ కంటే మగ శిశువులు 14,63 మంది ఎక్కువగా జన్మించారు. అయితే మరణాల్లోనూ పురుషుల శాతమే అధికంగా ఉంది. పురుషులు 9,550 చనిపోతే.. మహిళలు 7,280 మంది చనిపోయారు. మహిళల కంటే పురుషులు 2,270 మంది ఎక్కువగా చనిపోయారు.



నాగర్‌కర్నూల్‌లో అత్యల్ప జననాలు..

ఉమ్మడి పాలమూరులోనే నాగర్‌కర్నూల్ జిల్లాలో అతి తక్కువగా జననాలు నమోదవుతున్నట్లు సీఆర్‌ఎస్ నివేదిక స్పష్టం చేస్తోంది. ఈ జిల్లాలో రూరల్ పరిధిలో 3,121 మంది జన్మించగా.. పట్టణ పరిధిలో 3,991 మంది పుట్టారు. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్ జిల్లానే పెద్దది. నాలుగు నియోజకవర్గ కేంద్రాలు, వైద్య సదుపాయాలు కూడా ఇక్కడ ఎక్కువగానే ఉన్నాయి. జనాభా కూడా మిగతా జిల్లాల కంటే ఎక్కువగానే ఉంటుంది. అయినా ఇక్కడ జననాల రేటు చాలా తక్కువగా ఉంది. అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 13,442 మంది పుట్టగా, నాగర్‌కర్నూల్‌లో అత్యల్పంగా 7,112 మంది పుట్టారు. మహబూబ్‌నగర్ తర్వాత నారాయణపేటలో అధిక జననాలు ఉండగా.. ఆ తర్వాత గద్వాల, వనపర్తి జిల్లాలు ఉన్నాయి.

నారాయణపేటలో అధిక మరణాలు..

నారాయణపేట జిల్లా పరిధిలో అధికంగా మరణాలు నమోదవుతున్నాయి. జననాల్లో మహబూబ్‌నగర్ తర్వాత స్థానంలో నారాయణపేట ఉండగా.. మరణాల్లో మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 2021 లెక్కల ప్రకారం సంవత్సరంలో 13,212 మంది జన్మించగా.. 4,666 మంది చనిపోయారు. తర్వాత స్థానంలో గద్వాల ఉంది. ఇక్కడ జననాలు 12,643 నమోదు కాగా.. మరణాలు

(మిగతా 6లో..)

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- లాస్ట్ టైం చెప్పినా పురోగతి లేదు
- బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే చర్యలు
- అభివృద్ధి పనుల సమీక్షలో కలెక్టర్ ఆగ్రహం


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, మే 14, (ఆంధ్రజ్యోతి): 'మీకు ఎన్ని సార్లు చెప్పాలి.. పనిమీద దృష్టి పెట్టలేరా.. లాస్ట్ టైమ్ చెప్పినా అభివృద్ధి పనుల్లో పురోగతి లేదు. సెప్టెంబరు 15 నాటికి పనులు పూర్తికావాలి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు' అని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిని బుధవారం ఆయన పరిశీలించారు. గ్రామపంచాయతీ భవనంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలో రెండు వరుసల రహదారి, పాలశీతలీకరణ నూతన భవన నిర్మాణం, ప్రతీ ఇంటికి సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించే పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత సమయంలో గ్రామంలోని అభివృద్ధి పనులన్నింటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, సంబంధిత శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌లు, గ్రామాభి వృద్ధి ప్రత్యేక అధికారి విజయకుమార్, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

- గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్


బార్డర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల, మే 14 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని నందిన్నె చెక్‌పోస్టును బుధవారం కలెక్టర్ బీఎం సంతోష్ తనిఖీ చేశారు. బార్డర్‌లోని అన్ని శాఖల అధికారులకు సీరియస్‌గా ఆదేశాలు జారీచేశారు. తెలంగాణలోకి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని, వేబిల్లులను పరిశీలించాలని ఆదేశించారు. కొన్ని రోజుల నుంచి కర్ణాటక ధాన్యం తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలలోకి వస్తుందని కలెక్టర్ తనిఖీలు చేశారని తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టుల రికార్డులను పరిశీలించారు. ప్రతీ వాహనం వివరాలు ఉండాలని ఆదేశించారు. అనంతరం నందిన్నెలో ఏర్పాటు చేసి ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. తేమ శాతం, గన్నీ బ్యాగులు, లారీల వివరాలను అడిగి తెలసుకున్నారు. హమాలీలను ఎక్కవ సంఖ్యలో ఉంచుకొని త్వరగా కొనుగోలు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంటన అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎస్‌వో స్వామికుమార్, డీఎం విమల, కేటీదొడ్డి తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

'ఇందిర సౌర గిరి జల వికాసం' ఒక వరం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

7



అర్ధాకలితో అల్లాడుతున్న మూగ జీవాలు

- గ్రాసం కరువై బక్కచిక్కుతున్న పశువులు
- కడుపు నింపేందుకు రైతుల అవస్థలు
- చుక్కలనంటుతున్న పశుగ్రాసం ధరలు

7



గద్వాల జిల్లాలో... గంజాయి కలకలం!

- చాపకింద నీరులా కొనసాగుతున్న అమ్మకాలు
- విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన యువకుడు

6

'అకాలం'తో అగచాట్లు


పెబ్బేరు : సుగూర్‌లో ధాన్యంపై కప్పిన కవర్లలో నిలిచిన వర్షపు నీటిని పారబోస్తున్న రైతులు

7

నిఘా నీడలో గ్రామాలు

- నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వస్తున్న ప్రజలు
- సత్ఫలితాలు ఇస్తున్న పోలీసుల కృషి

వనపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తోంది. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా మారుతోంది. నిమిషాల వ్యవధిలోనే నిందితులను పట్టిస్తోంది. కాలానికి అనుగుణంగా టెక్నాలజీ స్పీడ్ అందుకోగా నేరాలను సులభంగా ఛేదిస్తూ వనపర్తి పోలీసులు ప్రజలతో శభాష్ అనిపించుకుంటున్నారు. జిల్లా పోలీసులు కమ్యునిటీ కాంటాక్ట్‌లో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రతీ గ్రామంలో నిఘా నేత్రం ఉండేలా అవగాహన కల్పిస్తున్నారు.

హై క్వాలిటీ కెమెరాలు

నేరాల నియంత్రణకు పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా వ్యాపారులతో పాటు, ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు వస్తున్నారు. ప్రస్తుతం 360 డిగ్రీల్లో తిరుగుతూ పరిసరాలు స్పష్టంగా రికార్డు అయ్యే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లోకి విద్యుత్ సరఫరా లేని చోట బ్యాటరీలు, సోలార్ సిస్టంలతో కూడిన సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడో కిలో మీటర్ల దూరంలో ఉన్న తన దుకాణం, ఇంటి వద్ద ఏం జరుగుతుంది అనే విషయాన్ని తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ ద్వారా లైవ్‌లో వీక్షించవచ్చు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 1,225 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో పోలీసులు ఈ సీసీ కెమెరాలను ప్రధాన చౌరస్తాలు, బస్టాండ్ వంటి ప్రాంతాలలోనే ఏర్పాటు చేసేవారు. కానీ ప్రస్తుతం గ్రామాలలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార దుకాణాల సముదాయాల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

నిర్వహణే అసలు సమస్య..

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వరకు బాగానే ఉంది. కానీ వాటి నిర్వహణను పోలీసులు స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. ముఖ్యంగా గ్రామాల్లో కోతులు సీసీ కెమెరాల వైర్లను తెంపడం ప్రధాన సమస్యగా మారింది. చాలా గ్రామాల్లో చిన్న చిన్న సమస్యలు ఉండగా వాటిని పట్టించుకోవడం లేదని పోలీసుల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని కూడా వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


వనపర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు


అమరచింత మండలం ఈర్లదిన్నెలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సురేశ్

'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని

సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాసం పథకం వరం లాంటిదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్ అన్నారు. ఈ పథకానికి ఇప్పటికే నిరుద్యోగుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2న రుణాల మంజూరు పత్రాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ పథకం అమలు తీరు, విధి విధా నాలను ఆయన బుధవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎన్ని యూనిట్లు మంజూరు చేస్తారు..?

మొత్తం 6,085 దరఖాస్తులు అందాయి. జిల్లాకు మంజూరైన 2,495 యూనిట్లను లబ్ధిదారులకు అందిస్తాం. ఇందులో రూ.50వేల లోపు యూనిట్లకు వందశాతం సబ్సిడీ రూ.లక్షలోపు యూనిట్లకు 90 శాతం సబ్సిడీ, రూ.2లక్షల లోపు యూనిట్లకు 80 శాతం సబ్సిడీ, రూ.3 నుంచి రూ.4 లక్షలలోపు యూనిట్లకు 70 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తాం.

లబ్ధిదారులను ఏ విధంగా ఎంపిక చేస్తారు..?

ఆయా మండలాల ఎంపీడీవోలతో దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. ప్రస్తుతం బ్యాంకర్ల పరిశీలన కొనసాగుతోంది. ఈనెల 15వ తేదీ నుంచి 25వ తేదీలోపు మండలస్థాయి ఎంపిక కమిటీలు అర్హులను గుర్తిస్తాయి. అనంతరం జిల్లా స్థాయి కమిటీ పరిశీలన తరువాత జిల్లా ఇన్‌చార్జి మంత్రికి జాబితాను అందజేస్తారు. జూన్ 2వతేదీ నుంచి 9వతేదీ వరకు లబ్ధిదారులకు సబ్సిడీ రుణాల మంజూరు పత్రాలు అందజే స్తాం.

రుణాల మంజూరుకు బ్యాంకర్లతో ఎలా సమన్వయం చేసుకున్నారు..?

కలెక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఇదివరకే బ్యాంకర్లతో మాట్లాడారు. సబ్సిడీ రుణాల మంజూరులో ఎలాంటి ఇబ్బందులు లేవు. నిజమైన లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి త్వరలోనే రుణాలు అందిస్తాం.

సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారా..?

సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు సిబిల్ స్కోర్ ఎలాంటి ప్రామాణికం కాదు. ఈ విషయంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా నిన్ననే క్లారిటీ ఇచ్చారు.

గతంలోని దళిత బంధు యూనిట్లను ఇటీవల ఏమైనా పరిశీలించారా..?

దళిత బంధు యూనిట్లను ఇటీవల కూడా పరిశీలించాం. లబ్ధిదారులు వాటిని చక్కగా వినియోగించుకుంటున్నారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని కూడా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుంటే ఆర్థికంగా లబ్ధిపొంది జీవితంలో స్థిరపడొచ్చు.

నిరుద్యోగ యువత కోసం ఎస్సీ అభివృద్ధి శాఖ ఎలాంటి కార్యక్రమాలు చేపడుతుంది?

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ యువతీ యువకులకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ చేపట్టాం. నేషనల్ అకాడమీ నిర్మాణ సంస్థ మూడు నెలల పాటు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ప్లంబింగ్, పాల్ సీలింగ్, టైలరింగ్ వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వనుంది. ఆసక్తి ఉన్న యువత సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

క్యాన్సర్ బాధితులకు ఊరట

- అందుబాటులో వైద్య సేవలు
- పాలమూరు జనరల్ ఆసుపత్రిలో ఏర్పాట్లు

6



పాలమూరు జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్యాలియేటివ్ కేర్ సెంటర్

సాంకేతికత మార్పులకు అనుగుణంగా బోధించాలి

» కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ స్టేట్ రిసోర్స్‌పర్సన్ పర్మగళ్ల నర్సింహ



కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలో మాట్లాడుతున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ పర్మగళ్ల నర్సింహ

గద్వాల సర్కిల్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని కెపాసిటి బిల్డింగ్ శిక్షణ స్టేట్ రిసోర్స్‌పర్సన్ పర్మగల్ల నర్సింహ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో నాణ్యత, సాంకేతికత తదితర మార్పులు తెచ్చేందుగా వీలుగా రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గణితం, సోషల్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు బుధవారం కెపాసిటీ బిల్డింగ్‌పై మొదటి విడత ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ ప్రారంభమైంది. బాలికల పాఠశాలలో నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ శిక్షణకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌ఆర్పీ నర్సింహ మాట్లాడుతూ ఆశించిన ఫలితాలురాబట్టేలా ప్రతి ఉపాధ్యాయుడు సమర్థవంతమైన బోధన చేయాలని సూచించారు. నాణ్యమైన బోధనతో విద్యార్థులకు మెళకువలపై అవగాహన కల్పించాలంటే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడుతాయని వివరించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌ను కచ్చితంగా వినియోగించాలని సూచించారు. విద్యార్థుల్లో మెరుగైన అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఇన్‌చార్జి, జీహెచ్‌ఎం నర్సింహస్వామి, పాఠశాల జీహెచ్ జహీరుద్దీన్, అకాడమిక్ మానటరింగ్ అధికారి ఎస్తేర్‌రాణి, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు వెంకటేశ్, కృష్ణ, కర్రెప్ప, రఘు, ఆయా మండలాల సబ్జెక్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

» జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు

» ఆర్‌ఎంపీ, పీఎంపీ కేంద్రాల ఆకస్మికంగా తనిఖీ

» ఒకే రోజు 4 ప్రథమ చికిత్స కేంద్రాల సీజ్



గాంధీచౌక్‌లోని ఒక ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు

వనపర్తి వైద్యవిభాగం, మే 14 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు హెచ్చరించారు. రోగుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని వచ్చీ రాని వైద్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వనపర్తి జిలాలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలను బుధవారం వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ప్రత్యేక బృందం సభ్యులు అకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఉన్న రెండు ఆర్‌ఎంపీ కేంద్రాలు, బలిజపల్లిలోని 2 ఆర్‌ఎంపీ కేంద్రాలను పరిశీలించారు. అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్న నాలుగు ప్రథమ చికిత్సా కేంద్రాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ గతంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కౌన్సెలింగ్ ఇచ్చామని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఆదేశించామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక బృందం సభ్యులు రవికుమార్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

» క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

» ఉత్సాహంగా అండర్-19, 23 జట్ల ఎంపికలు



అండర్-19 బాలుర జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ అన్నారు. ఈ నెల 19 నుంచి నిర్వహించనున్న జిల్లా స్థాయి 2డేస్ లీగ్ టోర్నీలో పాల్గొనే జిల్లా అండర్-19, 23 జట్ల ఎంపికలను బుధవారం బోయపల్లి సమీపంలో ఎండీసీఏ మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలకు 6 జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఒక్కో జట్టు 5 మ్యాచ్‌లు ఆడుతాయని, టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో హెచ్‌సీఏ సహకారంతో గత రెండేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేసవి శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. గత ఏడాది గణేశ్ రంజీకి ఎంపికయ్యాడని, ఇటీవలే ఇంగ్లాండ్ కౌంటీల్లో చోటు దక్కించుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ అబ్దుల్లా, సీనియర్ క్రీడాకారుడు మక్తర్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్-19 ఎండీసీఏ జట్టుకు రామాచారి, కాన్షిక్‌గౌడ్, శేఖర్, దినేష్, లోకేష్, అబ్దుల్ రఫె, అంకిత్‌రాయ్, అభినవ్, అభిషేక్, ప్రణయ్, ప్రవీణ్, శ్రీకాంత్, పవన్ ఎంపికయ్యారు. అండర్-23 జట్టులో తరుణ్, అబ్దుల్ రఫె, అక్షయ్, గణేష్, శ్రీకాంత్‌నాయక్, షాదాబ్, ఆబిద్, సయ్యద్ ఇమ్రాన్, వివేక్, కే. శ్రీకాంత్, రయాన్, వంశీ, శాశంక్, అంజనీశ్వర్, ముఖిత్, ఇమ్రాన్ స్థానం సంపాదించుకున్నారు.

క్యాన్సర్ బాధితులకు ఊరట

» అందుబాటులో వైద్య సేవలు

» పాలమూరు జనరల్ ఆసుపత్రిలో ఏర్పాట్లు



కీమో థెరపి సెంటర్ కోసం ఏర్పాటు చేసిన వార్డు



వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వార్డు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) మే 14 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలకు క్యాన్సర్ చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు ప్రారంభించాయి. ఇందులో భాగంగా మెడికల్ కళాశాల, ఆసుపత్రులు ఉన్న జిల్లాల్లో క్యాన్సర్‌కు సంబంధించిన ప్యాలియేటివ్ కేర్ సెంటర్, కీమో థెరపీ చికిత్స కేంద్రాలను, అలాగే వృద్ధులకు ప్రత్యేకంగా ఓపీతో పాటు, వార్డును కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పాలమూరు జనరల్ ఆసుపత్రిలోనే క్యాన్సర్ చికిత్సను అందించే కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్యాలియేటివ్ కేర్ సెంటర్

క్యాన్సర్ బారిన పడి చివరి దశలో ఉన్న రోగులకు చికిత్స అందించేందుకు ప్యాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఐదేళ్ల క్రితం జనరల్ ఆసుపత్రి ఎదుట రూ. 20 లక్షల వ్యయంతో ప్యాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. అప్పట్లో క్యాన్సర్ బాధితుల ఇళ్లకు వెళ్లి చికిత్స అందించారు. కానీ రోడ్డు విస్తరణలో భాగంగా ఆ భవనాన్ని కూల్చివేశారు. దీంతో ఆసుపత్రి వెనుక ఉన్న కొవిడ్ భవనంలో 10 పడకలతో మళ్లీ ఏర్పాటు చేశారు. కాని ఆశించినంత స్థాయిలో చికిత్స అందించలేకపోయారు. ఆ తర్వాత ప్రభుత్వం వాటిని పునరుద్ధరించాలన్న ఉద్దేశంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. భవనానికి రంగులు వేయించి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. అందులో 10 పడకలతో పూర్తి స్థాయి ప్యాలియేటివ్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు.

కీమో థెరపీ సెంటర్

వాస్తవానికి జిల్లాలో క్యాన్సర్ రోగులకు ప్రభుత్వ పరంగా చికిత్స అందించే వ్యవస్థ లేదు. బాధితులు చికిత్స, కీమో థెరపీ కోసం హైదరబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పాలమూరు జనరల్ ఆసుపత్రిలోనే పూర్తిస్థాయి చికిత్స అందుబాటులోకి రానున్నది. అందుకోసం 10 పడకలతో కీమో థెరపీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మెడికల్ ఆంకాలజిస్టును కూడా నియమించారు. కీమో థెరపీపై 10 మంది నర్సింగ్ సిబ్బందికి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో శిక్షణ ఇప్పించారు. దీంతో పాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా ఆసుపత్రిలోనే నిర్వహించనున్నారు. అందుకోసం మోమోగ్రామ్ స్క్రీనింగ్‌కు సంబంధించిన యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు.

ఈ వారంలోనే ప్రారంభం



వృద్ధులకు ప్రత్యేక క్లినిక్, కీమో థెరపీ, ప్యాలియేటివ్ కేర్ సెంటర్‌కు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేశాం. రంగులు వేయించి వార్డులను ఆధునికీకరించాం. ఈ నెల 15న వార్డులను ప్రారంభించాల్సి ఉండగా, అనివార్యకారణాలతో వాయిదా పడింది. వారం రోజుల్లో అన్ని సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. క్యాన్సర్ బాధితులు హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పని లేకుండా పాలమూరు జనరల్ ఆసుపత్రిలోనే చికిత్స పొందొచ్చు.

- డా. సంపత్‌కుమార్ సింగ్, సూపరింటెండెంట్.

వృద్ధులకు ప్రత్యేక వార్డు

అనారోగ్యం బారిన పడిన వృద్ధులకు ఆసుపత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారి కోసం ఓపీతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆసుపత్రిలోని కొవిడ్ ఐసీయూ వార్డులో 10 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి, నర్సింగ్ సిబ్బందిని నియమించనున్నారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదా?

» మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

వనపర్తి, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదా అని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. యాసంగి సీజన్ ప్రారంభం నుంచి రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన అనేక హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రతీ రోజు రైతులు రోడ్లపైకి వస్తుంటే, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులు ధర్నా చేస్తుంటే కొందరు పార్టీలకు అంట కడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

తెలకపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని చిన్నముద్దునూరులో విద్యుత్ షాక్‌తో ఓ ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన జనుంపల్లి నరేందర్‌రెడ్డికి చెందిన ఎద్దు బుధవారం అదే గ్రామానికి చెందిన రఘుమారెడ్డి పొలంలో గడ్డి మేస్తూ, ట్రాన్స్‌ఫారం వద్ద విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయింది. దాని విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

గద్వాల జిల్లాలో... గంజాయి కలకలం!

» చాపకింద నీరులా కొనసాగుతున్న అమ్మకాలు

» విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన యువకుడు



అయిజ మండలంలోని రైతుల పంట పొలాల్లో పట్టుబడ్డ గంజాయి మొక్కలతో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు. (ఫైల్)

అయిజ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో గంజాయి విక్రయాలు కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా మంగళవారం జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 680 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. జిల్లా కేంద్రానికి చెందిన కొందరు యువకులు ఈజీ మనీకి అలవాటుపడి కర్ణాటక, హైదరాబాదు, గోవా, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి గంజాయితో పాటు, దీంతో తయారైన సిగరెట్లు, చాక్లెట్లను జిల్లా కేంద్రానికి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్కడి నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి ఎక్కువ ధరకు స్థానిక యువకులకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. దీంతో వారు మత్తుకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్.

రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం గంజాయి, గుట్కా, నాటుసారా విక్రయ, తయారీదారులపై ఉక్కుపాదం మోపాలని పోలీస్, ఎక్సైజ్, రెవెన్యు, వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ సందర్భంగా గద్వాల జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పలువురిపై కేసులు నమోదు చేశారు. అప్పట్లో అయిజ మండలంలోని మేడికొండ, ఈడిగోనిపల్లి, యాపదిన్నె, కుర్వపల్లి, చిన్నతాండ్రపాడు, వడ్డేపల్లి మండలంలో తనగల, గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లోని రైతుల పొలాల్లో అక్రమంగా పెంచిన గంజాయి మొక్కలను అధికారులు ధ్వంసం చేశారు.

పట్టుబడుతున్న గంజాయి, నల్లబెల్లం

● గతేడాది ఫిబ్రవరిలో జిల్లాలోని కొత్తపాలెం స్టేజీ వద్ద రూ. 7 లక్షల విలువైన 510 (150 క్వింటాళ్లు) నల్లబెల్లం బస్తాలను ఎక్సైజ్ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. తమిళనాడుకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

● 2024, మేలో మక్తల్ పరిధిలోని ఓ దాబాలో మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి వద్ద 80 గ్రాముల గంజాయిని గుర్తించి పట్టుకున్నారు.

● గతేడాది డిసెంబర్‌లో గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద బెంగళూరు నుంచి హైదరాబాదుకు వెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేసి, ఏడుగురి నుంచి 18.5 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

అక్రమమార్గంలో డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వారి వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఇలాంటి వారి వివరాలను ప్రజలు, యువకులు నిర్భయంగా తెలియజేయాలి. వారిపై విచారణ చేపట్టి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని అన్ని మండలాల పోలీసులు గంజాయి, నాటుసారా, నల్లబెల్లంతో పాటూ ఇతర మత్తు పదార్థాల క్రయ, విక్రయాలపై పటిష్ట నిఘా ఉంచారు.

- మొగులయ్య, డీఎస్పీ, గద్వాల

క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జడ్చర్ల మినీస్టేడియంలో అండర్-19, అండర్-23 పోటీల ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న క్రీడాకారులు

జడ్చర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు (అండర్-19, అండర్-23) క్రీడాకారులను బుధవారం ఎంపిక చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. అందుకోసం మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మినీ స్టేడియంలో ని యోజకవర్గ క్రికెట్ జట్టు క్రీడాకారుల ఎంపికకు నిర్వహించిన పోటీల్లో జడ్చర్ల, షాద్‌నగర్, కల్వకుర్తి ప్రాంతాలకు చెందిన 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు సతీష్, ఉమాశంకర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు బాద్మి రవిశంకర్, అశోక్‌యాదవ్, రాంమోహన్, నరసింహయాదవ్, కాల్వ రాంరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ పరిశీలకుడు మన్నన్, కోచ్‌లు మోయిన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పురుషులే ఎక్కువ

5వ పేజీ తరువాయి

4,459 నమోదయ్యాయి. అత్యల్పంగా మహబూబ్‌నగర్ జిల్లాలో 1,364 మంది చనిపోయారు. మహబూబ్‌నగర్‌లో మరణాల కంటే జననాలు పదిరెట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక మరణాల రేటు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో తక్కువగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 16,830 మంది మరణించగా.. వారిలో గ్రామీణ ప్రాంతాల్లోనే 12,198 మంది చనిపోయారు. పట్టణ ప్రాంతాల్లో 4,632 మంది మరణించారు. ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రమే గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణంలో మరణాలు ఎక్కువగా నమోదయ్యాయి. మిగతా అన్ని జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మరణాలు నమోదయ్యాయి. గ్రామీణ ప్రాంతాల వారికి ఇప్పటికీ వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండకపోవడం, అవగాహన లేకపోవడం ఇందుకు కారణంగా చెప్పవచ్చు.

శిశు మరణాల్లో గద్వాల ప్రథమం..

సీఆర్‌ఎస్ నివేదికలో పుట్టబోతున్న శిశువుల మరణాలు, శిశు మరణాలను విడివిడిగా విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రసవ సమయంలో 622 మంది శిశువులు మరణించగా.. పుట్టిన తర్వాత 343 మంది చనిపోయారు. ఇందులో నాగర్‌కర్నూలు జిల్లాలో ప్రసవ సమయంలో శిశువుల మరణాలు లేవు. శిశు మరణాల సంఖ్య కూడా మిగతా జిల్లాల కంటే తక్కువగా నమోదైంది. ప్రసవ సమయంలో శిశువు మృతి, శిశు మరణాల విషయంలో గద్వాల ప్రథమ స్థానంలో ఉంది. శిశు మరణాలు ఈ జిల్లాలో 106 నమోదు కాగా.. ప్రసవ సమయంలో 300 మరణాలు నమోదయ్యాయి. తర్వాత స్థానంలో నారాయణపేట జిల్లా ఉంది. ఇక్కడ శిశు మరణాలు 94 నమోదు కాగా, ప్రసవ సమయంలో 233 మరణాలు నమోదయ్యాయి. ప్రసవాలపై అవగాహన లేకపోవడం, చివరి నిమిషం వరకు ఎదురుచూడటం వంటి కారణాల వల్ల ప్రసవ సమయంలో ఎక్కువ మరణాలు నమోదవుతున్నాయనే అంచనాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో జననాల వివరాలు...

	రూరల్		అర్బన్		మొత్తం		మొత్తం
జిల్లా పేరు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	
మహబూబ్‌నగర్	1656	1409	5209	5168	6865	6577	13442
నాగర్‌కర్నూలు	1668	1453	2165	1826	3833	3279	7112
గద్వాల	5460	4943	1155	1085	6615	6028	12643
నారాయణపేట	4582	4365	2179	1995	6761	6360	13121
వనపర్తి	1036	834	2179	1995	5771	5030	10801

ఉమ్మడి జిల్లాలో మరణాల వివరాలు...

	రూరల్		అర్బన్		మొత్తం		మొత్తం
జిల్లా పేరు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	పురుషులు	స్త్రీలు	
మహబూబ్‌నగర్	230	188	517	429	747	617	1364
నాగర్‌కర్నూలు	922	769	641	405	1563	1174	2737
గద్వాల	2205	1628	371	255	2576	1883	4459
నారాయణపేట	2145	1834	413	274	2558	2108	4666
వనపర్తి	1266	1011	840	487	2106	1498	3604

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

» పనులు త్వరగా పూర్తి చేయాలి

» నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అచ్చంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లమల పర్యటనకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. 'ఇందిర సౌరగిరి జల వికాసం' పథకాన్ని ప్రారంభించేందుకు ఈనెల 18న ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా అమ్రాబాద్ మండల పరిధిలోని మాచారం గ్రామంలో సభ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌లు బుధవారం పరిశీలించారు. పార్కింగ్, సభాస్థలి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ 17 తేదీ లోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట డీఆర్‌డీఏ అధికారి చిన్న ఓబులేస్, డీపీవో రామ్మోహన్‌రావు, ఆర్డీవో మాధవి తదితరులున్నారు.

మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు



ఒబేదుల్లా కొత్వాల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. మైనార్టీల అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఆయనను కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు షానవాజ్‌ఖాన్, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

» 6.12 లక్షలు అందించిన స్నేహితులు



కానిస్టేబుల్ తల్లికి ఆర్థిక సాయం చేస్తున్న మిత్రులు

అచ్చంపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అతడి స్నేహితులు అండగా నిలిచి, ఆర్థిక సాయం అందించారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన కానిస్టేబుల్ శ్రీనునాయక్ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 2013 కానిస్టేబుల్ బ్యాచ్ స్నేహితులు అతడి కుటుంబానికి అండగా నిలిచారు. ఉమ్మడి నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన వారు రూ. 5 లక్షలను అతడి కుమార్తె కృతిక పేరున భార్య చంద్రకళ సమక్షంలో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మరో రూ 1.12 లక్షలు అతడి తల్లి లక్ష్మికి అందించారు. కార్యక్రమంలో మిత్రులు అలీం, అశోక్, మహేశ్, వెంకటేశ్, మల్లేశ్, కృష్ణ, దేవ్లానాయక్, మత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య


మొల్గర శ్రీనివాసులు (ఫైల్)

బిజినేపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బిజినేపల్లి ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని పాలెం గ్రామానికి చెందిన మొల్గర శ్రీనివాసులు (55), భార్య నీలమ్మల మధ్య కుటుంబ పోషణకు సంబంధించి బుధవారం ఉదయం గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన శ్రీనివాసులు గ్రామ సమీపంలోని అయ్యగారి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనపై కుమారుడు సిద్దు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

» నెల్లికుదురులో ఒకరు.. కూచూరులో మరొకరు..


సాయి (ఫైల్)

వెల్దండ/ నవాబ్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు సంఘటనల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా, తెల్కపల్లి మండలంలోని నెల్లికుదురు గ్రామానికి చెందిన కోమల సాయి (28), భార్య శిరీష, కుమార్తె తేజశ్రీలతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి తెల్కపల్లి మండలంలోని పెద్దూరుకు వెళ్తూ, వెల్దండ సమీపంలో రోడ్డుపై నిలిపివున్న డీసీఎంను వెనుక నుంచి ఢీకొన్నది. ప్రమాదంలో కుమార్తె తేజశ్రీ అక్కడికక్కడే మృతి చెందింది. సాయి, శిరీషలే తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సాయి మృతి చెందాడు. శిరీష పరిస్థితి విషమంగా ఉంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మిద్దె మీద నుంచి కింద పడి...

మిద్దె మీద నుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలోని కూచూరు గ్రామంలో ఈ సంఘటన జరిగింది. నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సలంద్రపల్లి యాదయ్య (48) ఈ నెల 1న రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి మిద్దె మీద పడుకున్నాడు. మరుసటి రోజు తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు కిందకు దిగుతూ జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఆయనను మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 13 న మృతి చెందాడు. మృతుడి కుమార్తె లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కృష్ణ, మే 14 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నారు. ఎస్‌ఐ నవీద్ తెలిపిన వివరాల ప్రకారం.. పేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు తమకు సమాచారం రావడంతో మధ్యాహ్నం సమయంలో దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు, రూ.29,420 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

» కేసు నమోదు

కల్వకుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు.. కల్వకుర్తి మండలం పరిధిలోని తాండ్రా గ్రామ శివారులోని ఎస్‌బీఎం వెంచర్ ముందు దేవరకొండ రోడ్డుపై ఒక గుర్తు తెలియని మగ మనిషి అందాజ (60-65) పడిపోయి ఉండగా గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్‌లో ఈ నెల 6న కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 12న అర్ధరాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గుర్తు తెలియని శవాన్ని ఎవరైనా గుర్తిస్తే తన సెల్ నెంబరుకు 8712657752కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు.

అనుమానాస్పదంగా మహిళ..

నాగర్‌కర్నూల్ క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందినట్లు నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలం వసంతాపూర్ గ్రామానికి చెందిన రాములమ్మ(40) భర్త గత నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఒంటరి జీవితాన్ని గడుపుతున్న రాములమ్మ నాలుగు రోజుల క్రితం అదృశ్యం అయ్యింది. ఈ నేపథ్యంలో నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామ శివారులో బుధవారం ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకొని పరిశీలించగా, ఆమె రాములమ్మ అని గుర్తించారు. సంఘటనపై ఆమె అన్న చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

» ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు.. » బైక్, ఆటో ఢీకొని మరొకరు

తిమ్మాజీపేట/ వనపర్తి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. తిమ్మాజీపేట ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజీపేట మండల పరిధిలోని బావాజీపల్లిలో బుధవారం భక్తుల బాలస్వామి (48) అనే వ్యక్తి తన పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. దున్నుతుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడటంతో ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. గమనించిన పక్క పొలానికి చెందిన రైతు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ఈ మేరకు భార్య రేవతమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతు డికి కుమారుడు, కుమార్తె ఉన్నారని చెప్పారు.

● వనపర్తి జిల్లా, మండల పరిధిలోని చిమనగుంటపల్లి శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాయిద్య కళాకారుడు మృతి చెందాడు. వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, తక్కశిల గ్రామానికి చెందిన మంగలి జమ్మన్న, సహచరుడు వెంకటేశ్వర్లుతో కలిసి ద్విచక్రవాహనంపై చిమనగుంట సమీపంలోని భజన మందిరానికి వెళ్తున్నారు. పాన్‌గల్ మండలం, బండపల్లి గ్రామానికి చెందిన మేకల రమేశ్ ఆటోను వేగంగా నడుపుతూ గ్రామ శివారులో ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో జమ్మన్న, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిద్దరినీ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ జమ్మన్న మృతి చెందాడు.

బాలికపై అత్యాచారం, కేసు నమోదు

కోస్గి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు అయింది. కోస్గి ఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పేట జిల్లా గుండుమాల్ మండలంలోని ఓ గ్రామ పంచాయతీ అనుబంధ తండాకు చెందిన బాలిక ఈనెల 9న సాయంత్రం బహిర్భూమికి వెళ్లింది. అదే సమయంలో తండాకు చెందిన యువకుడు బాలికను వెంబడించి అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్ధాకలితో అల్లాడుతున్న మూగజీవాలు

» గ్రాసం కరువై బక్కచిక్కుతున్న పశువులు
» కడుపు నింపేందుకు రైతుల అవస్థలు
» చుక్కలనంటుతున్న పశుగ్రాసం ధరలు
» ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు
» ట్రాక్టర్ గడ్డి ధర రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు


ఎండిపోయిన గడ్డిని మేస్తున్న పశువులు


కొనుగోలు చేసిన గడ్డిని ట్రాక్టర్‌లో తెస్తున్న రైతు

చారకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి) : గ్రాసం కరువై పశువులు అర్ధాకలితో అలమటిస్తున్నాయి. వాటి కడుపు నింపేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. స్థానికంగా పశుగ్రాసం తగినంత లభించకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వస్తోంది. అందుకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుండటంతో రైతులపై ఆర్థిక భారం పెరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. పశువైద్య శాఖ అధికారుల లెక్కల మేరకు 2018-19 పశుగణన ప్రకారం మండలంలో దాదాపు 20 వేలకు పైగా పశువులు, మేకలు, గొర్రెలు ఉన్నాయి. దాదాపు 5 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీంతో పొలాల్లో పచ్చిక మాయం అయ్యింది. దీనికి తోడు పంటలు సరిగా పండక పశుగ్రాసం కరువైంది. దీంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి గ్రాసం కొని తీసుకురావాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిలో గడ్డి విత్తనాలు సరఫరా చేసినా, అవి ఏమాత్రం సరిపోవడం లేదని రైతులు చెప్తున్నారు.

రెట్టింపైన పశుగ్రాసం ధర

స్థానికంగా పశుగ్రాసం లభించకపోవడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. మండలానికి చెందిన రైతులు నల్గొండ జిల్లా కన్నెగల్, మల్లేపల్లి, హాఇయా, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి వరిగడ్డిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ట్రాక్టర్ గడ్డి ధర రూ. 15 వేల నుంచి 20 వేల వరకు పలుకుతోంది. అక్కడి నుంచి తీసుకొచ్చేందుకు మరో రూ. 2 వేలు ఖర్చు అవుతోందని రైతులు చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాడి రైతులకు దాణా, పశుగ్రాసాన్ని ఉచితంగా అందించాలని కోరుతున్నారు. లేకపోతే తాము జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారమైన పశుపోషణ

ఒక్కో పశువుకు ప్రతీ రోజు 25 నుంచి 30 లీటర్ల వరకు నీరు, దాదాపు 20 కిలోల పశుగ్రాసం అవసరం అవుతుంది. ఒకటి, రెండు పశువులున్న రైతులు ఏదో విధంగా కాలం వెళ్లదీస్తున్నా, ఎక్కువ పశువులున్న రైతులకు వాటిని పోషించడం భారంగా మారింది. ఆర్థిక స్థోమత లేని వారు ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసం కొనుగోలు చేసి తెచ్చుకోవడం కష్టతరంగా మారింది. దీంతో పశువులను సంతకు తోలుకెళ్తున్నారు. అక్కడ వాటికి సరైన ధర రాకపోవడంతో దుఃఖాన్ని దిగమింగుకొని అయిన కాడికి అమ్ముకుంటున్నారు.



పశువులకు మేత దొరుకుత లేదు

ఈ ఏడాది ఎన్నడూ లేనంతగా పశుగ్రాసం కొరత ఏర్పడింది. గతంలో నాకు 10 ఆవులు, గేదెలు ఉండేవి. ప్రస్తుతం 6 మాత్రమే ఉన్నా, వాటి కడుపు నింపేందుకు ఇబ్బంది పడుతున్నాం. నల్గొండ జిల్లా నుంచి ట్రాక్టర్ గడ్డిని రూ. 15 వేల నుంచి 20 వేలు ఖర్చు చేసి దిగుమతి చేసుకుంటున్నాం. పెరిగిన ధరలతో పశుపోషణ భారంగా మారింది.

- బాల్‌రాం, రైతు, జూపల్లి



పశుగ్రాసం కేంద్రాలను ఏర్పాటు చేయాలి

వేసవి కాలం కావడంతో మూగజీవాలకు మేత కరువైంది. వాటి ఆకలి తీర్చలేక ఇబ్బంది పడుతున్నాం. గతంలో ఎప్పుడూ పశుగ్రాసం కొనుగోలు చేయలేదు. ఈ ఏడాది పంటలు ఎండిపోవడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో ఉచిత పశుగ్రాసం కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- అంగోత్ పాండునాయక్, రైతు, మర్రిపల్లి



గడ్డి విత్తనాలు సరఫరా చేశాం

మండలంలో పశుగ్రాసం కొరత ఎక్కువగానే ఉంది. దాదాపు అన్ని గ్రామాల్లో 5 నుంచి 6 టన్నుల వరకు కొరత ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం రైతుల వద్ద కొంత మేరకు గ్రాసం ఉంది. దానికి తోడు ఇప్పటి వరకు రైతులకు 1000 కిలోల గడ్డి విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందించాం. పశుగ్రాసం కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- డాక్టర్ శివకుమార్, మండల పశువైద్యాధికారి, చారకొండ

'అకాలం'తో అగచాట్లు

» కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం


జానంపైట శివారులో గాలివానకు నేలకు ఒరిగిన వరి పైరు


తేమశాతం వచ్చిన తూకం చేయకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసినట్లు చూపిస్తున్న రైతు

పెబ్బేరు రూరల్/ గండీడ్, మే 14 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం అన్నదాతలను అగచాట్ల పాలు చేస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేకపోవడంతో రైతులు ఆరబోసుకున్న ధాన్యం వర్షానికి తడిసి ముద్దవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెబ్బేరు మండలంలోని సూగూర్, కొత్తసూగూర్, అయ్యవారిపల్లి, పాతపల్లి, గుమ్మడం, శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం, తిప్పాయిపల్లి, జానంపేట గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రంలో రైతులు నిల్వ చేసుకున్న, ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కప్పేందుకు టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం తూకాల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తడిసిన ధాన్యం

మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు, వెన్నచేడ్ కొనుగోలు కేంద్రా ల్లో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసిపోయింది. ఆరబెట్టిన ధాన్యంపై కప్పేందుకు కవర్లు పూర్తి స్థాయిలో లేకపోవడం, వసతులు కల్పించకపోవడం సమస్యగా మారిందని రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు.

'ఇందిర సౌర గిరి జల వికాసం' ఒక వరం

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ


ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నల్లమల గిరిజనులకు ఇందిర సౌరగిరి జల వికాసం పథకం వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 18న నల్లమల పర్యటనకు వస్తున్న సందర్భంగా బుధవారం అచ్చంపేట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఇందిర సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 2.10 లక్షల మంది గిరిజన రైతుల భూములకు విద్యుత్, సాగునీటి సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఇలాంటి పథకాన్ని దేశంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ అమలు చేయలేదన్నారు. నాయకులు, కార్యక ర్తలు, మహిళలు, అభిమానులు అధికసంఖ్య లో తరలివచ్చి సీఎం పర్యటనను విజయవం తం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, సీని యర్ నాయకుడు బాలాజీ, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, నాయకులు మోపతయ్య, మల్లేశ్, శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, నర్సయ్య యాదవ్, కట్ట అనంతరెడ్డి, రామనాథం పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రిమాండ్

నవాబ్‌పేట/ మిడ్జిల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. నవాబ్‌పేట ఎస్‌ఐ విక్రం, మిడ్జిల్ ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా, నందిపేట మండలం, నుతిపల్లి గ్రామానికి చెందిన పాశం నరేందర్ కొంతకాలంగా మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం, తాళ్లగడ్డ గ్రామంలో నివసిస్తున్నాడు. ఈ నెల 5న మద్యం తాగి ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వస్తూ అంబేద్కర్ చౌరస్తాలో ఎస్‌ఐ విక్రంకు పట్టుబడ్డాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి, బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరిచారు. అతడికి రూ. 5 వేలు జరిమానా, రెండు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి ఆర్.శశిధర్ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించకపోవడంతో మరో రోజు అదనంగా జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిడ్జిల్ మండలంలో ఈ నెల 12న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో వనపర్తి జిల్లా, పానగల్ మండలం, కల్వరాల గ్రామానికి చెందిన యాదగిరి పట్టుబడ్డాడు. ఆయనను బుధవారం కోర్టులో హాజరు పరచగా, రూ. 2 వేల రూపాయల జరిమానా, 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ్డ లారీ


బోల్తాపడ్డ లారీ

మక్తల్‌రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ సమీపంలో ఓ లారీ డివైడర్‌ను ఢీకొని జాతీయ రహదారి-167పై బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. రాయచూరు నుంచి బాల్‌నగర్‌కు తౌడులోడ్‌తో వెళుతున్న లారీ బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. లారీ ఢీకొనడంతో డివైడర్ రెయిలింగ్ నుజ్జునుజ్జు అయ్యింది.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

మిడ్జిల్, మే 14: (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలో దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించామని, కొత్తూరు, మిడ్జిల్ గ్రామాల మధ్యన ఆ ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

కృష్ణ, మే 14 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా కృష్ణ మండలంలోని కృష్ణానది నుంచి అనుమతి లేకుండా కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా వైపు వెళ్తున్న రెండు ఇసుక టిప్పర్లను మంగళవారం రాత్రి చెక్‌పోస్టు సిబ్బంది పట్టుకుని తహసీల్దార్ వెంకటేష్‌కు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దార్ చెక్‌పోస్టు వద్దకు చేరుకొని టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలకు మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్‌ఎం సంతోష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ క్షేత్రంలో గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని అయిన సరస్వతి నదులు సంగమిస్తాయని తెలిపారు. పుష్కరాల సందర్భంగా ప్రతీ రోజు ఒక రకమైన హోమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పుష్కరాలను దక్షిణ కుంభమేళాగా పరిగణిస్తారని తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పవిత్ర పుష్కర స్నానంతో పాటు కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దర్శనం కూడా చేసుకోవచ్చని తెలిపారు. పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తుందని తెలిపారు. సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్ వాసులు, లేదా మిత్రులు, కుటుంబసభ్యులతో కలిసి వెళ్లేందుకు బస్సులను బుక్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అందుకోసం దగ్గరలో ఉన్న బస్ డిపోల్లో సంప్రదించాలని సూచించారు.

కొత్తకోటలో 40.0 డిగ్రీల ఉష్ణోగ్రత

వనపర్తి అర్బన్/నారాయణపేట, మే 14(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా ఎండ తీవ్రత పెరిగింది. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోటలో 40.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్పంగా చిన్నంబావి మండలంలో 24.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 39.3, కనిష్ఠం 25.1 డిగ్రీలు నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గరిష్ఠం 37.3 డిగ్రీలు, కనిష్ఠం 28 డిగ్రీలు,

నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 36 డిగ్రీలు, కనిష్ఠం 26 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠంగా 35 డిగ్రీలు, కనిష్ఠంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం

» తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ జె.చీన



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించిన తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ జె.చీనా

పెద్దమందడి, మే 14 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయాల డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫైర్స్ డాక్టర్ జె.చీన అన్నారు. వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం, మోజర్ల గ్రామంలోని ఉద్యాన కళాశాలలో ఈ నెల 13, 14 తేదీల్లో ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా రామగిరి ఖిల్లా, ఆదిలాబాద్‌లోని దస్నాపూర్, నల్గొండలోని గడ్డిపల్లి, కొల్లాపూర్‌లోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల ముగింపు సందర్భంగా కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి డాక్టర్ జె.చీన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువులతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఉందన్నారు. అందుకోసం అన్ని కళాశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని, కోచ్‌లను నియమించామని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, రామగిరి ఖిల్లా ఉద్యాన పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నవీన్‌కుమార్, గంట గోపాల్‌రెడ్డి, ఉద్యాన పాలిటెక్నిక్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ నరేశ్ గౌడ్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు మోటార్ ప్రారంభిస్తున్న నాయకులు

పెబ్బేరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు మునిసిపాలిటీ 2వ వార్డులోని ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయాన్ని మాజీ కౌన్సిలర్ అక్కమ్మ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు కాలనీలో వృథాగా ఉన్న చేతిపంపును తొలగించి బోరు మోటార్‌ను అమర్చి కాలనీ ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం కోసం ఆమె కృషి చేశారు. దీంతో కాలనీలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే, మాజీ కౌన్సిలర్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ సాగర్, మోతే రాములు, యుగేందర్ రెడ్డి, రణదీర్ రెడ్డి ఉన్నారు.

ఆసుపత్రులు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించండి



చర్చిస్తున్న జిల్లా అధికారులు

వనపర్తి వైద్యవిభాగం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రులు, వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లే శ్రీనివాసులు అన్నారు. వైద్య సంబంధిత అంశాలపై డీఎంహెచ్‌వో, ఎస్పీ, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సుదీర్ఘంగా చర్చించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు తన చాంబర్‌లో ఎస్పీ రావుల గిరిధర్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, అసంక్రమిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామచంద్రరావులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... హెల్త్‌కేర్ వైద్య సిబ్బంది, ఆసుపత్రులుపై జరిగే దాడుల ను అరికట్టాలని, విధుల్లో ఆటంకాలు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అంతే కాకుండా వైద్య సిబ్బంది నిర్లక్ష్యాలు, వాటిపై జరిగే విచారణ, అదేవిధంగా మత్తు పదార్థాల వాడకం తదితర అంశాలపై రాజీ పడే ప్రసక్తే ఉండకూడదని చర్చించారు.

కార్యకర్తకు మాజీ మంత్రి పరామర్శ

పెద్దమందడి, మే 14 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తను మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం పెద్దమందడి గ్రామానికి చెందిన ఇఫ్తేఖర్ అహ్మద్ అనారోగ్యంతో బాధపడటం తెలుసుకున్న మాజీ మంత్రి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

పాన్‌గల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శాఖాపూర్, కదిరెపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి రాజవర్దన్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ధాన్యాన్ని తాలు, గడ్డి పుల్లలు లేకుండా తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటించాలి

మదనాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్ డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలు తప్పకుండా పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మాదనాపురం, కొత్తకోట, అమరచింత మండలాలకు చెందిన డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ దామోదర్, ఏవోలు గాయత్రి, జాస్మిన్, డీలర్లు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం

కొత్తకోట, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన కార్పెంటర్ అబ్దుల్ హఫీజ్ దంపతులు హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వేర్వేరుగా ఇంటికెళ్లి పూలమాలలతో బుధవారం సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. హజ్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థనలు చేయాలని కోరారు. సన్మానం చేసిన వారిలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, జట్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వర్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బోయోజ్, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, వెంకటరమణ, సలీం, ఏజాజ్, ముజీబ్, భరత్ భూషణ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాఘువేందర్‌గౌడ్, ఖాజామైనోద్దీన్, వహిద్‌అలీ తదితరులు ఉన్నారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

ఖిల్లాఘణపురం, మే 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుకాడిపల్లి, అంజనగిరి క్షేత్రం అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉన్న గోశాలకు మంగళవారం హైదరాబాద్ వ్యవసాయ శాఖ విజిలెన్స్ కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న రఘురాం 30వేల రూపాయల విలువ గల పశుగ్రాసాన్ని అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఏడాదికి రెండు సార్లు సీజన్ల వారీగా గోశాలకు 1100 కట్టల (గడ్డిని) గ్రాసాన్ని అందిస్తున్నట్లు రఘురాం తెలిపారు.

టీడీపీ మండల నూతన కమిటీ ఎన్నిక

వీపనగండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వీపనగండ్ల మండల నూతన కమిటీని కొల్లాపూర్ నియోజక వర్గ టీడీపీ నాయకుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా పి.సతీష్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాంబాబు, గొల్ల ఆంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శిగా గోవుల బాలరాజు, రమేష్ యాదవ్, కార్యదర్శులుగా ఎం.బిచ్చన్నయాదవ్, విశ్వనాయక్, కోశాధికారిగా పి.వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు ఆయన బుధవారం తెలిపారు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్

పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారి నుంచి పెద్ద పెద్ద అమ్మకాలు చేస్తున్న వ్యాపారుల దాకా వారు అమ్మకాలు చేపట్టే సరకులను ప్లాస్టిక్ కవర్‌లో వేసి ఇస్తున్నారు. వీటివినియోగం తర్వాత వాటిని కాలువలో, ఖాళీ స్థలాల్లో వేయడంతో ఇబ్బందికరంగా మారుతున్నాయి. ఒక్కో కుటుంబం సగటున రోజుకు 3నుంచి 5వరకు కవర్లను వాడి పడేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై అప్పుడప్పుడు అవగాహన కల్పిస్తున్నా తూతూ మంత్రంగానే ముగుస్తుంది.



కొత్తకోట బైపాస్‌కు వెళ్లేదారికి ఇరువైపులా చెట్లమాటున వాడిపడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు

- మునిసిపాలిటీలో ప్లాస్టిక్ నిషేధానికి తూట్లు
- ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు
- అవగాహన కరువు, నియంత్రణ శూన్యం
- దారిపొడవునా.. ఖాళీ స్థలంలో కుప్పలు, తెప్పలు
- ప్రమాదం అంచున మునిసిపల్ ప్రజలు
- అప్రమత్తం కాకుంటే అంతే సంగతులు

పెబ్బేరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగం ప్రమాదకరమని తెలిసినా రోజురోజుకూ వాటి అవసరం పెరుగుతూనే ఉంది. కవర్లను నియంత్రించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసిన రోజున హడావిడిగా తనిఖీలు చేపట్టి మమా అనిపిస్తున్నారు. కవర్ల తయారీదారులు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదన్నది జగమెరిగిన సత్యం. మునిసిపల్ అధికారులు వివిధ వ్యాపారుల యజమానులకు అవగాహన కల్పించినప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేకపోతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డ్రైనేజీలో ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు

వినియోగదారులు వాడుతున్న కవర్లు వాటి వినియోగం తర్వాత చేరేది కాలువలోకే అన్నది మాత్రం కళ్లకు కనిపిస్తున్న సాక్ష్యం. మునిసిపాలిటీలోని డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ నిండిపోవడంతో మురుగు నీరు సక్రమంగా ముందుకు వెళ్లకపోవడంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మునిసిపల్ సిబ్బంది పలు డ్రైనేజీ కాలువల్లో ఎంత చెత్త తీసినా మరుసటి రోజుకు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి కనిపిస్తుంది.

ఖాళీ స్థలాల్లో కవర్లు, డబ్బాల దర్శనం

మునిసిపాలిటీ కేంద్రం నుంచి కొత్తకోట బైపాస్, రంగాపూర్ బైపాస్‌ల రోడ్డుకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, చికెన్, మటన్ షాపుల నిర్వాహకులు కుళ్లిన వ్యర్థాలు రోడ్డుకు ఇరువైపులా పడేస్తున్నారు. కొల్లాపూర్ చౌరస్తా రోడ్డుకు దగ్గర భారీగా చేపల విక్రయం కొనసాగించడంతో వ్యర్థపదార్థాలతో దుర్వాసన వెదజల్లుతున్నది.

ఆ దారుల వెంట వెళ్లే ప్రజలు ముక్కు మూసుకొని ప్రయాసతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టకపోతే మరింత ప్రమాదం తప్పదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవకోటి మనుగడకు ప్లాస్టిక్ హానికరం



జీవకోటి మనుగడకు ప్లాస్టిక్ హానికరం. ప్రభుత్వ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను చైతన్యపరచాలి. ప్రతీ వ్యక్తి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి. అప్పుడే ప్లాస్టిక్ నిషేదం సాధ్యమవుతుంది.

- సత్యం సాగర్, సామాజికవేత్త, పెబ్బేరు

● నిషేధంపై విస్తృత ప్రచారం చేస్తున్నాం



చిరువ్యాపారుల నుంచి మొదలుకొని పెద్దపెద్ద వ్యాపారస్తుల వరకు ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలను నిషేధించాలని సూచిస్తూనే హెచ్చరిస్తున్నాం. ఖాళీ స్థలాల్లో ప్లాస్టిక్ కవర్లు వేయవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనపై ప్రతీ పౌరుడికి బాధ్యత ఉంది. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- అశోక్ రెడ్డి, కమిషనర్, పెబ్బేరు మునిసిపల్

ట్రాన్స్‌పోర్టు సమస్య తలెత్తితే చర్యలు

- ఆత్మకూరులో కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీలు
- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఆత్మకూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల వద్ద ట్రాన్స్‌పోర్టు సమస్య తలెత్తితే సంబంధిత గుత్తేదారులపై చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటాలు చేసి నాలుగు రోజులు గడుస్తున్నా ధాన్యాన్ని తీసుకువెళ్లేందుకు లారీల కొరత ఏర్పడిందని రైతులు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆయన ఆరేపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ట్రాన్స్‌పోర్టు గుత్తేదారులు కొనుగోలు కేంద్రాలకు సరిపడే లారీలు డీసీఎంలను ఏర్పాటు చేశాం కానీ, రైస్ మిల్లుల వద్ద అన్‌లోడింగ్ కాస్త లేటు అవ్వడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ట్రాన్స్‌పోర్టు అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో ఆయన స్పందించి ఆత్మకూరు, అమరచింత కొనుగోలు కేంద్రాల వద్దకు అదనంగా మరో నాలుగు లారీలను అందుబాటులో ఉంచాలని గుత్తేదారులకు ఆదేశించారు. అనంతరం పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మి ఆగ్రోటెక్ ఇండస్ట్రీస్‌ను పరిశీలించి కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లుకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేసి పంపితే సౌకర్యంగా ఉంటుందని, అందుకు సరిపడా హమాలీలను అదనంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ధాన్యంలో ఎక్కువగా తాలు ఉన్నాయని సాకుతో తూకంలో అదనంగా కోతలు విధించరాదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తేమ శాతం తాలు గుర్తించిన అనంతరమే ధాన్యం కొనుగోలు చేస్తార ని తెలిపారు. అదేవిధంగా రానున్న రెండు రోజుల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురు స్తుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు తమ ధాన్యాన్ని టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకునేలా మండల అధికారులు కొనుగోలు సెంటర్ల నిర్వాహకులు రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. ఆత్మకూరు తహసీల్దార్ చాంద్‌పాషా, శ్రీలక్ష్మి ఆగ్రోటెక్ యజమాని పులిమామిడి రమేష్ శెట్టి, ట్రాన్స్‌పోర్టు గుత్తేదారు నీలేష్ శెట్టితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆరేపల్లి గ్రామంలో రైతు సమస్యలను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్ల దోపిడీ అరికట్టాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు

వీపనగండ్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైస్ మిల్లర్ల దోపిడీ అరికట్టి రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల ఆంజనేయులు అన్నారు. మండల పరిధిలోని తూంకుంట గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కల్లుగీత కార్మిక సంఘం, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకుల బృందం బుధవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకొచ్చి రైతులు నెల రోజులు దాటుతున్నా కొనుగోలు చేయడం లేదన్నారు. తాలు ఉందనే నెపంతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వర్షం వస్తే కప్పుకోవడానికి కవర్లు కూడా లేవని వర్షం వస్తే తీవ్రంగా నష్టం పోవాల్సి వస్తుందన్నారు. లారీల యాజమాన్యాలు కూడా గత రెండు సంవత్సరాల నుంచి ట్రాన్స్‌ఫోర్ట్ డబ్బులు ఇవ్వకపోవడంతో వారు సకాలంలో లారీలను పంపడం లేదన్నారు. జిల్లా అధికారులు, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కేంద్రాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు చేసే విధంగా అధికారులకు సన్నద్ధం చేయాలని అన్నారు.



తూంకుంటలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల నిమిత్తం పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ... విధులు నిర్వహించే సమయంలో పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో ఉండటంతో పాటు సమయ పాలన పాటించా లని సూచించారు. విధులు నిర్వహించే సమ యంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ఉన్నతాధి కారుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. ఏదైనా సమస్య నిమిత్తం ఫిర్యాదుదారుల నుంచి ఫోన్ వస్తే ఆలస్యం చేయకుండా బాధితులకు సమస్య పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.

డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ న రేష్, వనపర్తి సీఐ కృష్ణ, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

టీకాలు వేయించుకోవాలి

పాన్‌గల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : వ్యాక్సిన్ టీకాలు వేయడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి భవిష్యత్తులో వచ్చే అంటువ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న రొటీన్ ఇమ్యూనైజేషన్ సెషన్ సైట్ పరిశీలించారు. హెల్త్ అసిస్టెంట్ నర్సమ్మ, ఆశా కార్యకర్త అలివేలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

పాత కక్షలతో గొడవ...

రేవల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): శానాయపల్లి గ్రామానికి చెందిన అంకూరి దేవమ్మ ఆమె భర్త నాగయ్య మంగళవారం రాత్రి ఇంటికి వెళ్తున్నారు. వారి ఇంటి పక్కన వారైన ఎత్తపు నడిపయ్య పాత గొడవలు మనసులో పెట్టుకొని దేవమ్మను బూతు మాటలు తిడుతూ వారిపై దాడి చేశారు. దేవమ్మ బుధవారం మండల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు.

ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేత

అమరచింత, మే 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ... ఈనెల 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో ఉపాధి కూలీల సిబ్బంది సమ్మెలో భాగస్వాములు అవుతారని ఆయన అన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజయ్, మోహన్, వెంకటన్న, ముని పాల్గొన్నారు.

నిరుపేదలకు సంజీవిని సీఎం రిలీఫ్ ఫండ్

పెబ్బేరు/కొత్తకోట, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు సంజీవిని లాంటిదని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు. పెబ్బేరు మునిసిపాలిటీకి చెందిన 12మంది బాధితులకు రూ.2,78,500 మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం సింగిల్ విండో కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సహదేవుడు, మన్యం, ఎండి.ముస్తాక్, చంద్రశేఖర్, ఆనంద్ సాగర్, ఎల్లస్వామి నాయుడు, నవీన్ గౌడ్, విజయ్ గౌడ్, విజయవర్ధన్ గౌడ్, శ్రీను, ఎండి.ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తకోట మండలంలోని రాయణిపేట గ్రామంలో అనారోగ్యం బారిన పడి హాస్పిటల్‌లో చికిత్స పొందిన నలుగురి లబ్ధిదారులకు ఆ గ్రామ నాయకులు చెక్కులను బుధవారం అందజేశారు. మాజీ ఉప సర్పంచ్ వెంకట్రామారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు సురేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, అశోక్, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

వినాయకుడి విగ్రహం ప్రతిష్ఠాపన

చిన్నంబావి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమారూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. విగ్రహ ప్రతిష్ఠకు సహకరించిన శ్రీనివాసరావు, చుక్క రావులకు గ్రామ కమిటీ పెద్దలు శాలువాతో సత్కరించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కొత్త కల్యాణ్‌రావు, విద్యాసాగర్ రావు, హనుమంతరావు, రమణయ్య, నరేందర్ గౌడ్, నరేష్ కుమార్, తిక్కన్న పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి

- మునిసిపల్ కమిషనర్ శశిధర్

ఆత్మకూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు పట్టణ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాల వర్తింపులో అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ శశిధర్ పేర్కొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పక్కా ఇల్లు లేని వారికి వర్తింపజేస్తున్న ఇందిరమ్మ ఇల్లు, యువత ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు గాను రాజీవ్ యువ వికాసం వంటి లబ్ధిదారుల ఎంపికలు అధికారులు తారతమ్యాలు లేకుండా ఎంపిక చేయాలని సూచించారు. అలాగే వృత్తి పన్నులు లైసెన్స్ నిర్వహణ, ఇంటి పన్నులు వంటి వసూళ్లపై దృష్టి సారించి వసూలు చేసే విధంగా చూడాలని ఆదేశించారు. మునిసిపల్ మేనేజర్ భూపాల్, వార్డుఆఫీసర్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ శశిధర్

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పెబ్బేరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచిరావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదో తరగతి చదువుకొని ముప్పై సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంత ఒకరికొకరు పలకరించుకొని వారి జీవిత స్థితిగతులను వివరించుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు బోధించి, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ ఉపాధ్యాయులు సూరారెడ్డి, సత్యనారాయణ, శేఖర్, వెంకట్రామరెడ్డి, పూర్వ విద్యార్థులు పార్వతమ్మ, శారద, విద్యావతి, వినోద, సనీత, రాధా, మంజుల, రాణి, వెంకటస్వామి, శివారెడ్డి, వెంకటేష్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.



కంచిరావుపల్లి పాఠశాలలో చదివిన పూర్వవిద్యార్థులు

ధర్మకాంటాలో బరువుల తనిఖీ

- తూనికల కొలతల శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ

ఖిల్లాఘణపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): ధర్మ కాంటాల్లో ధాన్యపు బస్తాల వాహనాల బరువులను బుధవారం తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ మండల కేంద్రంలోని వే బ్రిడ్జిలను తనిఖీ చేశారు. ధర్మకాంటా తూకాల్లో వ్యత్యాసాలు వస్తున్నాయని రైతులు ఆరోపణలు చేసిన నేపథ్యంలో వే బ్రిడ్జీలను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు. వే బ్రిడ్జిలలో బరువులను తనిఖీ చేయగా వేరువేరుగా బరువులు వచ్చినట్లు గుర్తించారు. కంపెనీలకు చెందిన ధర్మకాంటాలు కావడంతో తేడాలు వస్తున్నట్లుగా గుర్తించామని తెలిపారు. వే బ్రిడ్జిలకు సంబంధించిన కంపెనీల టెక్నీషియన్‌లను పిలిపించి బరువు యంత్రాల్లో ఉన్న సాంకేతిక సమస్యలను గుర్తిస్తామన్నారు. మరోసారి ధర్మకాంటాల సమస్యలను ఆయా కంపెనీ ప్రతినిధులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బరువుల్లో వ్యత్యాసాలు వచ్చిన రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని అన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ కురుమూర్తి, తూనికల కొలతల కార్యాలయ సిబ్బంది శేషయ్య, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.



ధర్మకాంటాలో వాహన బరువును పరిశీలిస్తున్న తూనికలు కొలతల జిల్లా అధికారి సత్యనారాయణ

సమ్మెతో నియంతృత్వ పాలనా వ్యవస్థను స్తంభింపచేస్తాం

- మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్

వనపర్తి వైద్యవిభాగం, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పాలన వ్యవస్థను స్తంభింప చేస్తామని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మిక వర్గం అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాల నుంచి దాదాపు 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతున్నదన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం అమలు చేయకుండా, నిత్యావసర ధరలను నియంత్రించకుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు, సవరణలు చేయకుండా మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెతో కార్మిక వర్గం మొత్తం వీధుల్లో వస్తున్నామని, సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్మికులు వరుణ్, బి కుమార్, శేఖర్, సైదా బేగం, భారతి, మన్నెమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, శివలీల, అంజనమ్మ, శ్రీగంగ, లక్ష్మమ్మ, శోభ, సుధ, రమ్య, శారద, శ్రీదేవి, జయలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్

సమ్మెను జయప్రదం చేయండి

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి) : ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆత్మకూరు మార్కెట్ యార్డు హమాలీ కార్మికులతో కలిసి సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగ్

పెబ్బేరు, మే 14 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు మునిసిపాలిటీలో బుధవారం బీజేపీ నాయకులు హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ పాల్గొని జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరు తమ ఇళ్లల్లో భారత జాతీయ జెండాను ఎగురవేసి దేశం పట్ల ప్రేమ, గర్వాన్ని చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు గౌని వేమారెడ్డి, పురుషోత్తంరెడ్డి, రామకృష్ణ, రంగస్వామి గౌడ్, ఆంజనేయులు, శివ తదితరులున్నారు.



జాతీయ జెండాతో ర్యాలీ చేపడుతున్న బీజేపీ నాయకులు